మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# కేజీవీబీ ఎస్ఓ నిర్లక్ష్యం విద్యార్థులకు తప్పని తిప్పలు

**ఎంఐయస్ అధికారికి మెమో జారీ**



వంటగదిని పరిశీలిస్తున్న దృశ్యం

**మాగనూరు, నవంబరు 23 ప్రభాతవార్త :** మాగనూరు మండల కేంద్రంలో కేజీబీవీ, ఎస్సీ హాస్టల్ ను జిల్లా అడిషనల్ కలెక్టర్ బెన్ షాలం తనిఖీ చేశారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగినటువంటి సంఘటన పునరావృత్తం కాకుండా తనిఖీలు నిర్వహిస్తున్నటువంటి జాయింట్ కలెక్టర్ బెన్ శాలం విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. మిషన్ భగీరథ నీరు సరైన సమయంలో రావడంలేదని తాగడానికి నీళ్ల లేక అవస్థలు పడుతున్నామని కాబట్టి మినరల్ వాటర్ కల్పించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇక విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని మరుగుదొడ్ల విపరీతమైనటువంటి వాసన వస్తుందని,విద్యార్థులకు రావాల్సిన పుస్తకాలు కొన్ని మాత్రమే పంపిణీ చేసినట్టు కలెక్టర్ దృష్టికి పలువులు తీసుకెళ్లారు. క్లాసులు జరుగుతున్న సమయంలో టీచర్లతో మీటింగ్ పేరున సమయాన్ని వృధా చేస్తున్నారని కలెక్టర్ కు విన్నవించారు. మధ్యాహ్న భోజనం బిల్లులు చేయడంలో నిర్లక్ష్యం వహించిన మాగనూరు ఎంఐఎస్ స్వప్నకు మెమో జారీ చేయవలసిందిగా అధికారులకు ఆదేశించారు. కస్తూర్బా పాఠశాలలో సమయం పాటించడం లేదని అదనపు కలెక్టర్ ఎస్ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. అదేవిధంగా ఎస్సీ హాస్టల్ ను తనిఖీలు నిర్వహించి వంటగదిని పరిసరాలను పరిశీలించడం జరిగింది ఈ తనిఖీల్లో భాగంగా తాసిల్దార్ సురేష్, ఎంపీడీవో రహీమోతుదిన్, ఆర్ఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో బీజేపీది ల్యాండ్ స్లైడ్ విక్టరీ

- సర్వేలు, అంచనాలు తలకిందులయ్యాయి
- కాంగ్రెస్ కాలికి గజ్జకట్టుకొని ప్రచారం చేసినా ఫలితం శూన్యం
- మీడియా సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌గర్ బ్యూరో నవంబరు23, ప్రభాతవార్త :** స్వతహాగా సీఎం రేవంత్ రెడ్డి వెళ్లి అబద్దాలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదని, తెలంగాణ మోడల్ అంటూ చేసిన ప్రచారం భోగస్ అని తేలిపోయిందని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ దుయ్య బట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రజలకు శఠగోపం పెట్టే పార్టీ కాంగ్రెస్ అని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. తెలంగాణ, కర్నాటకలో కాంగ్రెస్ ఏమి హామీలిచ్చింది, ఎలా మోసం చేసిందో ప్రజలకు తెలిసిపోయిందన్నారు. బీజేపీని ఈదేశ ప్రజలు విశ్వసించారని అందుకే ఎన్డీఏ కూటమికి బిజెపికి మోడీ ప్రభుత్వానికే పట్టం కట్టారని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో గెలుపు కోసం కాంగ్రెస్ కుట్రలు చేయాలని చూసిందని, రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టే సెంటిమెంట్ రాజకీయం చేశారని కానీ ప్రజలు నమ్మలేదు అన్నారు. ఈ దేశాన్ని విచ్చిన్నం చేయాలన్న కాంగ్రెస్ కుట్రలు మహారాష్ట్రలో పని చేయలేదన్నారు. మహారాష్ట్ర ప్రజలు బీజేపీపై నమ్మకం ఉంచారని, ప్రధాని మోదీ, షిండే, ఫడ్నవిస్ పై ప్రజలు నమ్మకం ఉంచారని పేర్కొన్నారు. ఈదేశానికి మహారాష్ట్ర వెన్నెముక లాంటిదని, ఈ గెలుపు మరాఠా ఓటర్లదే అని స్పష్టం చేశారు. ఈదేశం బాగోగులు, భద్రత కోరుకున్న వారంతా బిజేపీని గెలిపించారని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు పద్మజా రెడ్డి, నాయకులు నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

# అరబిందో ఫార్మాపై చర్యలు తీసుకోండి

- ముదిరెడ్డిపల్లి గ్రామాన్ని కాపాడండి
- ఉదండాపూర్ భూసేకరణ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయండి
- అసెంబ్లీ స్పీకర్‌కు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫిర్యాదు

**జడ్చర్ల, నవంబరు 23, ప్రభాతవార్త:** అసెంబ్లీలో లేవనెత్తిన సమస్యలపై కూడా అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎలాగని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తాను అసెంబ్లీ లో చర్చించిన సమస్యలపై అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఈ విషయం గానే ఆయన శనివారం ఒక వినతి పత్రాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సమర్పించారు. తన నియోజవర్గంలోనీ ఉదండాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించిన భూ సేకరణలో భారీగా అక్రమాలు జరిగాయని,భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులో అవకతవకలు జరిగాయని తన దృష్టికి రావడంతో ఈ విషయం గురించి తాను అసెంబ్లీలో కూడా మాట్లాడి ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని కోరానని చెప్పారు.అయితే ఈవ్యవహారంలో అధికారులు ఇంతవరకు స్పందించలేదన్నారు. ఉదండపూర్ భూ సేకరణపై విచారణ చేయించాలని,ఇందులో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు.అలాగే జడ్చర్ల ఫార్మా సెజ్‌లో ఉన్న అరబిందో ఫార్మా కంపెనీ విడుదల చేస్తున్న కలుషితనీరు కారణంగా ముడిరెడ్డిపల్లి గ్రామానికిచెందిన చెరువు పూర్తిగా కలుషితమై అందులో చేపలు చచ్చి పోతున్నాయని, పంటలు పండడం లేదని, ప్రజలు కూడా అనారోగ్యాల బారిన పడుతున్నారని తాను అసెంబ్లీ లో ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. అయితే ఈ విషయం గురించి కూడా ఇప్పటి వరకూ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోగా అరబిందో ఫార్మా కంపెనీ ఇప్పటికీ కలుషిత నీటిని చెరువు లోకి వదులుతూనే ఉందని వాపోయారు. ఈ విషయం గురించి వెంటనే చర్యలు తీసుకొని ముదిరెడ్డిపల్లి గ్రామాన్ని కాపాడాలని అనిరుధ్ రెడ్డి కోరారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే కోనో కార్పస్ చెట్లను తొలగించాలని తాను కోరిన విషయంగా కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. అసెంబ్లీలో తాము లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి కోరారు.



స్పీకర్ కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

# నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**ఐ.కె.పి ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్**

**వనపర్తి ప్రతినిధి నవంబరు 23 ప్రభాతవార్త:** ప్రతి వరి కొనుగోలు కేంద్రంలో ధాన్యం శుభ్రం చేసుకోవడానికి వసతులు కల్పిస్తూ, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో ఐ.కె.పిద్వారా ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్పించిన వసతులు పరిశీలించి రైతులతో మాట్లాడారు.కొనుగోలు కేంద్రంలో 40కిలోలకు ఒక అరకిలో అదనంగా తూకం చేసి వరిబస్తాలు మిల్లులకు పంపిస్తే అక్కడ తూకం తక్కువ చేసి చూపుతున్నారని కలక్టర్ దృష్టికి తీసుకురాగా,స్పందించిన కలక్టర్ లారివెంట ఒకరైతును మిల్లుకు పంపించాలని రైతు సమక్షంలో తూకం చూసుకోవాలని సూచించారు.కారణంలేకుండా తూకం తక్కువ చూపడానికి వీలు లేదని ఆదేశించారు.డి.పి.యం అరుణ, కేంద్రాల నిర్వాహకులు, రైతులు వెంట ఉన్నారు.



కొనుగోలు కేంద్రంలో తుకాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# కుటుంబ సర్వే నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

**నారాయణపేట టౌన్, నవంబరు 23 ప్రభాతవార్త :** సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఫారాలలోని వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శనివారం ఆమె జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో కొనసాగుతున్న డాటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాటా ఎంట్రీలో ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండరాదని, ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని కుటుంబాల వివరాలను కంప్యూటర్లో నమోదు చేయాలని చెప్పారు. డాటా ఎంట్రీకి అవసరమైన కంప్యూటర్లు, ల్యాబ్ ట్యాప్‌లను సమకూర్చుకోవాలన్నారు. డాటా ఎంట్రీ సమయంలో ఎన్యూమరేట్ అందుబాటులో ఉండాలన్నారు. వార్డులు, గ్రామాల వారీగా సర్వే పూర్తయిన ఫారాలను ఎక్కడ భద్ర పరిచారని అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఫారాలు బయట ఎక్కడా కనిపించ రాదని, సర్వే పూర్తయిన ఫారాల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేశామని, ఇక వాటితో పని లేదని ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా భద్ర పరచాలన్నారు. నమోదు ప్రక్రియను ఉదయం నుంచి రాత్రి వీలైనంత వరకు కొనసాగించాలని, డాటా ఎంట్రీ కి సంబంధించి ఆపరేటర్లకు -మిగతా4లో..



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న దృశ్యం

# మక్తల్‌కు ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు

- పట్టణ శివారులో గొల్లపల్లి సమీపంలో వచ్చే నెలలో ప్రారంభోత్సవం
- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు : ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, నవంబరు 23 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గ కేంద్రానికి దాదాపు 170 కోట్ల రూపాయలతో అత్యంత భారీ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి చొరవతో మక్తల్ నియోజవర్గ కేంద్రానికి రెండో విడతలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు అయిందని, ఇందుకు సహకరించిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి లకు ధన్యవాదాలు తెలిపారు. తొలి విడతలో కేవలం పైలట్ ప్రాజెక్టు కింద 20 వరకు మాత్రమే మంజూరు కాగా, వాటికి 50 కోట్లకు మించి నిధులు మంజూరు కాలేదని తెలిపారు. రెండో విడతలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా,ఆయన ప్రత్యేక చొరవ చూపించి మక్తల్ నియోజవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉండాలని. అందులో భాగంగా రెండో విడతలో మంజూరైన 26 ఇంటిగ్రేటెడ్ స్కూల్ లలో మక్తల్ కు చోటు లభించిందని.. ఈ సందర్భంగా సీఎం రేవంత్, ఇతర మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మొత్తంగా తొలి రెండు విడతలలో కలిపి దాదాపు 50 వరకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ లకు మంజూరు కాగా కేవలం మూడు నాలుగు చోట్ల మాత్రమే వీటికి సంబంధించిన స్థలం, ఇతరత్రా అనుమతుల ప్రక్రియ లు పూర్తయ్యాయని అందులో మక్తల్ కూడా ఉందని ఎమ్మెల్యే తెలిపారు మక్తలు పట్టణ శివారులోని గొల్లపల్లి సరిహద్దు వద్ద దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 2500 మందికి పైగా విద్యార్థులు దాదాపుగా కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే విధంగా భవిష్యత్తులో సైతం అన్ని రకాలుగా ఉపయోగపడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను దాదాపు 170 కోట్ల రూపాయలు నిధులతో ఏర్పాటు చేసుకోబోతున్నామని అన్నారు. సర్వే తో పాటు, కలెక్టర్ ,ఇతర రెవెన్యూ అధికారులు అందరూ స్థలానికి సంబంధించి అన్ని ప్రక్రియ పనులు పూర్తి చేయగా.. రాబోయే రోజుల్లో వీలైతే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగానే ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు ప్రారంభోత్సవం చేసుకుందామని అన్నారు. దీంతోపాటు నారాయణపేట జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజ్ కోసం నారాయణపేట ఎమ్మెల్యే పర్నికా రెడ్డి తో కలిసి సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే 26 కోట్లతో నర్సింగ్ కాలేజీని సీఎం మంజూరు చేశారని తెలిపారు. ఇక మక్తల్ పట్టణంలో 150 పడకల ప్రభుత్వాసుపత్రికి గతంలో కేవలం మంజూరు మాత్రమే ఉందని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత స్థలానికి సంబంధించి సర్వే , ఇతరత్రా పనులను పూర్తిచేసుకుని అది కూడా త్వరలో పనుల ప్రారంభోత్సవం ఉంటుందని.. దీంతోపాటు కృష్ణాలో పీహెచ్ సీ సెంటర్ నిర్మాణ పనుల సైతం ప్రారంభించుకున్నామని తెలిపారు. మక్తల్ పట్టణంలో అతి త్వరలో ఏర్పాటు కానున్న కోర్టుకు సంబంధించి పరిధి ప్రాంతం కోసం ఇటీవలే గెజిట్ విడుదలైందని.. అందులో భాగంగా ఐదు మండలాలు మక్తల్, మాగనూరు, కృష్ణ , ఉట్కూరు, నర్వలను కలిపి మక్తల్ కోర్టు కిందే నిర్ణయించారని అన్నారు. ఇటీవలే సిసి రోడ్లు, ఇతర రోడ్ల మరమ్మత్తు కోసం ఇప్పటికే 15 కోట్లు మంజూరవగా ఆ పనులు ప్రారంభించుకున్నామని.. వీటితోపాటు అదనంగా మరికొన్ని రోడ్ల కోసం 50 కోట్ల నిధులు అతి త్వరలో విడుదల కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ముంపు గ్రామాల సమస్యకు సైతం అతి త్వరలో పరిష్కారం లభిస్తుందని ఆ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. మక్తల్ నియోజవర్గ అభివృద్ధి తన ప్రధాన ధ్యేయమని ఇందుకోసం ఎవరు సలహాలు, సూచనలు ఇచ్చిన వాటిని స్వీకరిస్తామని అన్నారు. ఇట్టి మీడియా సమావేశంలో, కాంగ్రెస్ ముఖ్య నాయకులు గావినోళ్ళ బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పి టిసి జీ.లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్, గాయత్రి అనిల్ గోలపల్లి నారాయణ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏ రవికుమార్, మండల అధ్యక్షులుగణేష్ కుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు శుభ్రమైన భోజనం అందించాలి

**నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట టౌన్,నవంబరు 23 ప్రభాతవార్త :** విద్యార్థులకు సూచి శుభ్రమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ నిర్వాహకులను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం ఉదయం 6.50ని.లకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాలను, బిసి కాలేజీ బాయ్స్ హాస్టల్,బీసీ గర్ల్స్ హాస్టల్స్ ను జిల్లాకలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కిచెన్ స్టోర్ లోని ఆహారపదార్థాలను,సామాగ్రిని స్టార్ట్‌రిజిస్టర్లు,ఫుడ్ క్వాలిటీ రిజిస్టర్లు, స్టూడెంట్ అటెండెన్స్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. అలాగే కిచెన్ రూమ్,డైనింగ్ హాల్,డార్మెటరీ,క్లాస్‌రూమ్స్,టాయిలెట్స్,స్టాఫ్ రిజిస్టర్లను పరిసరాలను పరిశీలించడం జరిగింది. అల్పాహార సమయంలో విద్యార్థులతో పాటు కూర్చొని అల్పాహారాన్ని భుజించడం జరిగింది. ఫుడ్ కమిటీ విద్యార్థులతో ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే విధంగా ఆహార నాణ్యత కొనసాగించాలని ప్రిన్సిపాల్ జగదీశ్వర్, డిప్యూటీ వార్డెన్ ఇంతియాజ్ లకు కలెక్టర్ సలహా ఇవ్వడం జరిగింది. బీసీ హాస్టల్‌లో బియ్యం తనిఖీ చేసి వంటలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు మైనారిటీ అధికారి ఎం.ఎ.రషీద్, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ ఖలీల్, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ,వార్డెన్ మాసూద్ మొదలైన అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థినిలతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్

## నాణ్యమైన ఆహార పదార్థాలను సరఫరా చేయాలి



కళాశాల వసతి గృహాలలో రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి నవంబరు 23 ప్రభాతవార్త:** వసతి గృహాలకు సరఫరా అయ్యే బియ్యం, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు నాణ్యవంతంగా ఉండాలని, లేనియెడల తిరిగి పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం ఉదయం వనపర్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహాన్ని, ఐజా కాలనీలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులముల బాలుర వసతి గృహం, కలశాల వసతి గృహాలను సందర్శించారు. ప్రతి వసతి గృహంలో బాధ్యత గల ఫుడ్ సూపర్వైజర్, విద్యార్థుల మెస్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహ విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. భోజనం బాగుంటుందా అని విద్యార్థులతో ఆరా తీశారు. భోజనం బాగుందని, భోజనశాల లేకపోవడం వల్ల ఆరుబయట భోజనం చేయాల్సి వస్తుందని కలక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలక్టర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, డి.సి. ఒ. తిరుపతయ్య, మన్నాన్, ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ రాజు తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కార్డెన్ సెర్చ్ !!

**వనపర్తి క్రైమ్,నవంబరు 23, ప్రభాతవార్త:** నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు, శనివారం వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు వనపర్తి డిఎస్పీ,వెంకటేశ్వర రావు , వనపర్తి సీ.ఐ,ఎం. క్రిష్ణ ఆధ్వర్యంలో సీఐలు 02, ఎస్సైలు 12 మంది మొత్తం 80 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి వనపర్తి రూరల్ పోలీస్టేషన్ పరిధిలోని జంగాలగుట్ట, బుడగ జంగాల కాలనీల లో పోలీసులు ఆకస్మికంగా కార్డెన్ అండ్ సెర్చ్ తనిఖీలు నిర్వహించి సుమారు 250 ఇళ్లను సోదాలు చేశారు. పత్రాలు సరిగా లేని నెంబర్ ప్లేట్ లేని 2,కార్లు 3, ఆటో 25 ద్విచక్రవాహనాలు మొత్తం30 వాహనాలు అదుపులోకి తీసుకొని సీజ్ చేసి వనపర్తి రూరల్ పోలీస్టేషన్ కు తీసుకువెళ్లారు. సంబంధిత వాహనాల యజమానులు తమ వాహనాల పత్రాలను చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా నిషేధిత గుట్కా ల గుడుంబా తయారీ, గంజాయిని విక్రహిచడం, పీడీస్ రైస్ అక్రమ రవాణా, కలప అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గుడుంబా,గుట్కా,గంజాయి లాంటి అక్రమ వ్యాపారం, చట్ట వ్యతిరేకమైన కార్యాకలాపాలకు పాల్పడకూడదన్నారు. వాహనాలు నడిపే టప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలి అని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలి అన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. వాహనాల సంబందించిన ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ కలిగి ఉండాలి అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఉండి ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో ఇన్సూరెన్స్ వర్తించదు ఇన్సూరెన్స్ గడువు ముగిషాక ముందే దానిని రెనివల్ చేపించుకోవాలని సూచించారు. మహిళల భద్రతే పోలీసుల లక్ష్యం అన్నారు. మహిళలు, యువతులు, చిన్నపిల్లలతో మర్యాదగా ప్రవర్తించి వారిని గౌరవించాలి. మన కుటుంబ సభ్యులతో ఎంత మర్యాదగా ఉంటామో బయట వారితో కూడా అలాగే మెదలాలని సూచించారు. మహిళ పట్ల, చిన్న పిల్లలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, వారిని మానసిక, శారీరకంగా హింసించిన వారిపట్ల చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని తెలిపారు. ప్రజలు, మహిళలు ఆపద సమయంలో, ఎవరైనా చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన, యువకులు గుంపులు గా ఏర్పడి బహిరంగ మద్యపానం సేవించిన, ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చే అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అన్నారు. ప్రజల రక్షణ, ప్రజలకు పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు అనే భరోసా నమ్మకం కలిగించే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగానే కమ్యూనిటీ కాంటాక్ట్ పోలీసింగ్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. కాలనలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ. కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. మీ కాలనీ లో ఎవరైనా కొత్తవారు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే డయల్ 100 కు గాని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. తనిఖీలు నిర్వహించడం వలన నేరాల రేటు తగ్గుతాయని ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని మనకు తెలిసినటువంటి నెంబర్ నుంచి వచ్చిన మెసేజ్లను లింకును ఓపెన్ చేయొద్దని, అత్యాశకు పోయి లాటరీ వచ్చిందని, లోన్ వచ్చిందని వచ్చిన, ఏదైనా గిఫ్ట్ లు వచ్చాయని ఫోన్ కాల్స్ వచ్చిన మెసేజ్ లు వచ్చినా వెంటనే వాటికి సమాధానమిస్తూ ఓటిపి లను పిన్ నెంబర్లను చెప్పకూడదు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లయితే వెంటనే 1930 లేదా డయాల్ 100 కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ, రాందాస్ తేజావత్, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వర్ రావు, వనపర్తి సిఐ, ఎం, కృష్ణ, కొత్తకోట సిఐ, రాంబాబు, సాయుధ దళ రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, వనపర్తి రూరల్ ఎస్సై, జలేందర్ రెడ్డి, అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, మహిళ కానిస్టేబుళ్లు. హోంగార్డ్స్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్డెన్ సెర్చ్ పై అవగాహన కల్పిస్తున్న ఎస్పి రావుల గిరిధర్

**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపైన చర్యలు తప్పవు**

**కాలనీలలో కొత్త వ్యక్తుల కదలికను పోలీసులకు సమాచారం ఇవ్వాలి :**

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్**

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి

**అమరచింత నవంబరు 23. ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని వనపర్తి జిల్లా డిపిఓ సురేష్ కుమార్ అధికారుల కు తెలిపారు. శనివారం అమరచింత మండలంలోని పామిరెడ్డి పల్లె గ్రామ శివారులోని కస్తూర్బా పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అలాగే పాఠశాలలో వంటగదిని మూత్రశాలలు స్టోర్ రూమ్ త్రాగునీటిని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు, ఉపాధ్యాయ బృం దం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం ఉండకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని అలాగే ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధ పెట్టి జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన ఉపాధ్యాయ బృందాన్ని కోరారు. అలాగే వంట చేసే సిబ్బంది రోజువారీగా భోజనం తయారు చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వారికి తెలిపారు. అలాగే విద్యార్థుల పట్ల అధికారుల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అధికారులు పాఠశాలలను పర్యవేక్షించాలని ఆయన వారిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో శ్రీనివాసులు మండల ఎంఈఓ భాస్కర్ సింగ్ కస్తూర్బా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలను ఆకస్మికతనిఖీ నిర్వహించిన అధికారులు

## కార్మికుల పెండింగ్ ఏరియల్స్ వెంటనే ఇవ్వాలి

**సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం**

**అమరచింత నవంబరు 23. ప్రభాతవార్త:** అమరచింత మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ ఏరియల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, ఆర్ఎన్ రమేష్, మునిసిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మహంకాళి ప్రభాకర్ మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిన అమలు చేయలేదని అలాగే గత పాలనలో మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచుతామని జీవో విడుదల చేసిన ఇప్పటివరకు వేతనాలు పెంచడం లేదని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అమరచింత మున్సిపల్ కార్మికుల కు 9 నెలలు ఏరియల్ పెండింగ్లో ఉన్నాయని వెంటనే పెండింగ్ లో ఉన్న మున్సిపల్ ఏరియల్ విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన పాలక పార్టీలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ సునీల్ రాజశేఖర్ చిన్న తిప్పన్న రవీందర్ మహేందర్ శ్రీను అజేందర్ కతాల్ రాము తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

## మహారాష్ట్రలో బిజెపి విజయం

**కొత్తకోట నవంబరు 23 ప్రభాతవార్త :** మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ విజయాన్ని సాధించడం పట్ల కొత్తకోటలో బీజేపీ నాయకులు ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. పట్టణ చౌరస్తాలో బాణసంచాలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మహారాష్ట్రలో 288 స్థానాలకు భారతీయ జనతా పార్టీ 222 స్థానాలను గెలుచుకొని కొత్త చరిత్రను సృష్టించిందని తెలిపారు. వి.డీ.తి. కూటమి 40 స్థానాలతో సరిపెట్టుకుందని అన్నారు. నీతికి, నిజాయితీకి పట్టం కట్టిన మహారాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గెలుపు కొరకు పని చేసిన భాజపా కార్యకర్తలకు జాతీయ భావాలు గల వ్యవస్థలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

## పాతమొల్గర నిరుద్యోగికి గోల్డెన్ ఛాన్స్

**ఒకే ఏడాదిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కించుకున్న గుంజ రమేష్**



**భూత్పూర్, నవంబరు 23, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం పాతమొల్గర గ్రామం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గుంజ రమేష్ తన స్వయం శక్తితో, తన మేధా సంపత్తితో ఒకే ఏడాదిలో ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించాడు. వివరాల్లోకి వెళితే పాతమొల్గరకు చెందిన గుంజు రమేష్‌కు తల్లితండ్రులిద్దరూ లేరు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు పాతమొల్గర ప్రభుత్వ పాఠశాలలో చదివి, 8, 9, 10తరగతులను జల్లాఘనపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్ లింగాల గురుకుల కళాశాలలో, డిగ్రీ, పీజీ తరగతులను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఎంవీఎస్ కళాశాల చదివి, ఎంఈడీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. తొలిసారి టీజీటీ ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, 2024 మార్చిలో విడుదలైన గురుకుల ఫలితాల్లో టీజీటీ ఇంగ్లీష్‌లో జూనియర్ లెక్చరర్‌గా, ఈ నెల 22న విడుదలైన టీజీపీఎస్సీ ఫలితాల్లో జూనియర్ లెక్చరర్ సాధించారు రమేష్. ప్రస్తుతం రమేష్ బిజినేపల్లి మండల గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. రమేష్ ప్రతిభను పలువురు ప్రశంసించారు.

## నిజాయితీ చాటుకున్న పెబ్బేరు 108 సిబ్బంది

**పెబ్బేర్ నవంబరు 23 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలో నిన్న రాత్రి జరిగిన యాక్సిడెంట్‌లో అనంతపురం జిల్లా మదనపల్లి నుండి టమాట లోడు తీసుకొని వెళ్లి హైదరాబాదులో ఖాళీ చేసి తిరుగు ప్రయాణంలో పెబ్బేరు బైపాస్ హరినాథ్ రైస్ మిల్లు దగ్గర టిప్పర్ కు వెనుక నుంచి ఢీకొనగా ఆ డి సి యం లోనే ఇంతియాజ్ అనే డ్రైవర్ స్టీరింగ్ లోపల ఇరుక్కున్నారు 108 సిబ్బంది 20 నిమిషాలు కష్టపడి అతని బయటికి తీయడం జరిగింది అతనికి ప్రతమ చికిత్స అందించరు. పెబ్బేరు ఆసుపత్రిలో చేరారు అతని దగ్గర ఉన్న 3 లక్షల రూపాయల పైచిలుకు అతను వాళ్లకు అప్ప చెప్పడం జరిగింది 108 సిబ్బంది కాజా, పైలెట్ ఈఎంటి మహమ్మద్ ప్రశంసించి కొనియాడడం జరిగింది. పేషంట్ ఇంతియాజ్ కోరిక మేరకు అతని కంపెనీ అతను నారాయణ స్వామికి ఇవ్వడం జరిగింది. మానవత్వం చాటుకున్న 108 సిబ్బందిని ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, ఈఎంఈ రత్నమయ్యా వారికి అభినందించారు.



బాధితులకు తిరిగి నగదు అందజేస్తున్న 108 సిబ్బంది

## ఘనంగ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు

**పెబ్బేర్ నవంబరు 23 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల కేంద్రంలోని సహారా ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ పార్టీ పెబ్బేరు మండల నాయకుల ఆధ్వర్యంలో ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినం పురస్కరించుకుని సోషల్ మీడియా వారియర్స్ బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. సోషల్ మీడియా వారియర్స్ అవగాహన సదస్సు ముఖ్య అతిథిగా సునీల్ వాల్మీకి పాల్గొని టిఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్క సోషల్ మీడియా కార్యకర్త నిరంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీలు కానీ హామీలపై ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పెబ్బేరు మండల అధ్యక్షులు వనం రాములు యాదవ్, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు వి దిలీప్ కుమార్ రెడ్డి, వనపర్తి సోషల్ మీడియా ఇంచార్జ్ సునీల్ వాల్మీకి, సోషల్ మీడియా పెబ్బేరు ఉమ్మడి మండల అధ్యక్షులు వడ్డె రమేష్ సోషల్ మీడియా వారియర్స్ పరమేశ్ నాయి, మూర్తి ,సిద్ధు ,రవీందర్, ఆనంద్ , ప్రకాష్ , వేణు,సాయి , రామన్ గౌడ్, రాకేష్,అశోక్ ,మహేష్ ,పర్వతాలు , గంగాధర్ ,కురుమూర్తి ,కర్ణాకర్ ,కలీల్ ,కురుమూర్తి ,శ్రీధర్ ,ఉషాన్ ,హారీష్ మూర్తి ,మన్యం విష్ణు తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారం కోసం వికలాంగుల రిలే నిరహార దీక్ష

**వనపర్తి టౌన్, నవంబరు 23 ప్రభాతవార్త:** కొత్త పెన్షన్లు లేక అర్హులకు రాక గోసపడుతున్న వారి సమస్యలను పరిష్కరించాలనీ అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు ఇవ్వాలనీ వికలాంగుల హక్కుల పోరాట సమితి (పిహెచ్పిఎస్) వనపర్తి జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా వివిధ మండలాల్ల వికలాంగుల కమిటీ అధ్యక్షులు, వితంతువులు, వృద్ధులు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. అనంతరం వికలాంగుల సమస్యలపై ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. రిలే నిరహార దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ, బిజెపి, ఎంఎస్పి, బిఆర్ఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ, ధర్మ సమాజ పార్టీల నాయకులు పాల్గొని వికలాంగులకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు సిఎం రేవంత్ రెడ్డి వికలాంగులకు వృద్ధులకు, వితంతువులకు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, వికలాంగులను వృద్ధులను వితంతులను మోసం చేసిన తీరు కరెక్టు కాదని మండిపడ్డారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు, ఒంటరి మహిళలకు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం భవిష్యత్తులో తీసుకుపోయే ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటూ వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు ఒంటరి మహిళలకు అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్, బిజెపి ఉపాధ్యక్షులు రామన్నగిరి వెంకటేశ్వర్ రెడ్డి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి, ఎమ్మార్పీఎస్ వనపర్తి అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య మాదిగ, ధర్మ సమాజ పార్టీ అధ్యక్షులు వీరపాగ రామకృష్ణ మహారాజ్, తగుల వెంకటస్వామి మాదిగ, మంద నరసింహ మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎం ఎస్ పి వనపర్తి జిల్లా నాయకులు గట్టు స్వామి మాదిగ, ఎం ఎస్ పి వనపర్తి జిల్లా కో కన్వీనర్, జామ ప్రభాకర్ శెట్టి, వి హెచ్ పి ఎస్ గౌరవాధ్యక్షులు ఎం శ్రీనివాసులు వి హెచ్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవేణి, వి హెచ్ పి ఎస్ మహిళా అధ్యక్షురాలు, పి శ్రీనివాసులు, వి హెచ్ పి ఎస్, పట్టణ అధ్యక్షులు గంధం కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గుట్ట శేఖర్, గంధం లక్ష్మయ్య, నాగశేషు, చంద్రయ్య , అన్నపూర్ణ, ప్రమీల మధు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు



వికలాంగుల రిలే నిరాహార దీక్షలో మద్దతు తెలుపుతున్న రాజకీయ పార్టీల నాయకులు

## కూలీలకు రూ.12000 జీవన భృతి చెల్లించాలి

**ఆత్మకూర్ నవంబరు 23 ప్రభాతవార్త:** గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలలో భాగంగా వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12,000 జీవన భృతిని చెల్లించాలని ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు ఈ మేరకు శనివారం రోజు ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో వ్యవసాయ కూలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారం చేపట్టిన తర్వాత గ్యారెంటీలను గాలికి వదిలేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు రాష్ట్రంలో దాదాపు 50 వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ రంగాలకు లక్షల కోట్ల రూపాయలను మాఫీలు కొనసాగిస్తూ వ్యవసాయ కార్మికులకు మాత్రం మొండి చేయి చూపిస్తుందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి గ్యారెంటీలను అమలు చేసే వరకు ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు అందులో భాగంగానే జూరాల గ్రామంలో వ్యవసాయ కార్మికులకు మద్దతుగా కరపత్రాల ప్రచారాన్ని మొదలుపెట్టారు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వ్యవసాయ కూలీలకు కార్మిక చట్టాల సూచన మేరకు 24 వేల రూపాయలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరోగ్యారెంటీలలో భాగంగా తక్షణమే కూలీలకు ఏడాదికి 12,000 చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సీను వెంకటన్న సూరి, మన్యం తదితరులతో పాటుగా పలువురు కూలీలు పాల్గొన్నారు.



జూరాల గ్రామంలో వ్యవసాయ కూలీలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షులు ప్రసాద్

## అమ్మాయిలకు అప్రమత్తత అవసరం: చిల్డ్రన్స్ ఫౌండేషన్

**భూత్పూర్, నవంబరు 23, ప్రభాతవార్త:** టీనేజ్ అమ్మాయిలు ఎల్లవేళలా జాగరూకత, అప్రమత్తతతో ఉండాలని కైలాష్ సత్యర్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమన్వయ కర్తలు జయంతి, చెన్నమ్మ అన్నారు. శనివారం భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవేర్‌నెస్‌ప్రోగ్రాంలో వారు విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతూ కొంత మంది టీనేజీఅమ్మాయిలు మోసకారుల మాయమాటలు నమ్మి ఇబ్బంధులకు గురౌతున్నారని, మోసకారుల పట్ల అప్రమత్తతతో ఉండాలని సూచించారు. ఎవరైన మోసాలకు పాల్పడితే వెంటనే 1098కు సమాచారమందివ్వాలని, లైంగిక వేధింపులకు గురి చేస్తే ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించకుండా పోలీసులకు ఫోన్ చేసి తెల్పాలని సూచించారు. బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని, ఎవరైన ప్రోత్సాహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలికల విద్య కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమపథకాలు ప్రవేశపెట్టాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గుముడాల చక్రవర్తిగౌడ్, విజయలక్ష్మి, జ్యోతి, శారద, అన్నె లియోనా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న జయంతి, చెన్నమ్మ తదితరులు

## దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు:మార్కెట్ యార్డ్ చైర్మన్

**కొత్తకోట నవంబరు 23 ప్రభాతవార్త:** రైతులు దళారుల చేతిలో మోస పోకూడదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దని రైతులు ధాన్యాన్ని అమ్ముకొని ప్రభుత్వం అందిస్తున్న బోనస్ అందుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ పి.ప్రశాంత్, సిడిసి చైర్మన్ గొల్లబాబు, కిసాన్‌సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సన్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించిన రైతులకు 48 గంటల్లో రైతుల ఖాతాలో బోనస్ కింద 500 చొప్పున ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వారు సూచించారు. దేశంలో ఎక్కడ చెయ్యని విధంగా ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కింది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు మన ముద్దుబిడ్డ రైతు సంక్షేమం పట్ల ఆహర్నిశలు కృషి చేస్తున్నారని, రైతులు కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులకు సహకరించాలని రైతులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్ పల్లి యాదవ్, మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, విండో మాజీ డైరెక్టర్ గుంత రమణ, గ్రామ అధ్యక్షుడు యాదగిరి, సాయిల్ గౌడ్, కోటేశ్వర్ రెడ్డి, కృష్ణయ్య గౌడ్, నాగేశ్వర్ రెడ్డి, మధ్యల వెంకటన్న, మంద కన్న తదితరులు పాల్గొన్నారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

## బాల్య వివాహం చేసిన వారెవరైనా నేరస్థులే

**బాల్యవివాహ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.. మహిళ సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ**

**వనపర్తి టౌన్, నవంబరు 23 ప్రభాతవార్త:** బాల్య వివాహాల వల్ల బాలికలు విద్యావకాశాలు కోల్పోవడం, ఆరోగ్య పరమైన సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అసమానతలు లాంటి తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయని బాల్య వివాహం చేసిన వారెవరైనా నేరస్థులేనని మహిళ సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం అధ్వర్యంలో శనివారం వనపర్తి పట్టణంలోని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ పాఠశాల బాలికలకు సైబర్ క్రైమ్, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు అనేది దేశంలో ఒక పెద్ద సమస్య మారిందని, బాల్య వివాహాల వలన పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయనీ అన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల వలన బాలబాలికలు తమ చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల వల్ల ఎంతో మంది బాల బాలికలు చిన్న వయసులోనే అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 18 సం నిండిన తర్వాత వివాహం చేసుకోవాలనీ, అలా లేని పక్షంలో బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం చట్టరీత్యా చర్య శిక్షకు గురవుతారని తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్ బారిన పడకుండ విద్యార్థులు సోషల్ మీడియాలో ఫేస్బుక్, ఇంస్టాగ్రామ్, వాట్సాప్ లో అమ్మాయిలు తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ సూచించారు. సోషల్ మీడియాలో వివిధ లింక్స్ పంపించి ఇబ్బందులకు గురి చేస్తారని, ఓటిపిల పేరుతో, ఓఎల్ఎక్స్, ఫేస్ బుక్ నకిలీ ఐడిల రూపంలో, మొబైల్ ఫోన్లకు మెసేజ్ లు పంపి ఆ లింక్ క్లిక్ ఎలాంటి లింక్స్ వచ్చినా కూడా వాటిపైన క్లిక్ చేయకుండా జాగ్రత్త పడాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్స్ బాలలకు 1098, సైబర్ క్రైమ్ సంబంధించి 1930, మహిళలకు గృహహింస 181, పోలీస్ 100, వయోవృద్ధులు సంబంధించి 14567 టోల్ ఫ్రీ నెంబర్లు వాటి ఉపయోగాల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక కేంద్రం స్పెషలిటీ ఫైనాన్షియల్ లిట్రేసీ సుమ, పోలీస్ షీ టీం ఎస్సై, భరోసా కేంద్రం సభ్యులు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన చేస్తున్న మహిళా సాధికారత కేంద్రం సుమ

## విద్యాసంస్థలలో మటన్ సరఫరాకు టెండర్ల ఆహ్వానం

**వనపర్తి ప్రతినిధి, నవంబరు 23 ప్రభాతవార్త:** జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలో మటన్ సరఫరా కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 25 విద్యా సంవత్సరానికి గాను 3 మైనార్టీ పాఠశాలలు, 3 మైనార్టీ కళాశాలలో మటన్ సరఫరా కోసం ఆసక్తి కలిగిన వారు పేరిట రూ. 1500 డిడి చెల్లించాలన్నారు. డిడిని తమ కార్యాలయంలో సమర్పించి ఈనెల 23వ తేదీ నుండి 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు టెండర్ ఫారాలు పొందాలన్నారు. టెండర్ ఫారం తీసుకున్నవారు డిస్ట్రిక్ట్ మైనర్టిస్ వెల్ఫేర్ ఆఫీసర్, వనపర్తి పేరిట రూ. 50వేలు ఈఎండి డిడి చెల్లించి టెండర్ ఫారానికి జత చేసి ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత విద్యాసంస్థలో ఏర్పాటుచేసిన టెండర్ బాక్స్ లో వేయాలన్నారు. టెండర్ బాక్స్ ను ఈనెల 30వ తేదీ జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) చాంబర్లో తెరుస్తారని ఆయన పేర్కొన్నారు.

## దొంగలను పట్టు కున్న పోలీసులు

**గద్వాల, నవంబరు 23, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో ఈ నెల 7వ తేదిన కారుఅద్దాలు పగలగొట్టి3,60,000/ రూపాయాల నగదు దొంగలించిన కేసు, రైల్వేశాఖలో ఉద్యోగాలు ఇప్పి స్తామని బాదితుల నుండి డబ్బులు తీసుకొని మోసగించిన కేసు, గద్వాల్ హెల్త్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసగించిన కేసుకు సంబంధించి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ సమావేశంలో డి.ఎస్పి శ్రీ సత్యనారాయణ , గద్వాల్ సిఐ శ్రీనివాస్ , గద్వాల్ టౌన్ ఎస్సై కళ్యాణ్ ,రూరల్ ఎస్సై శ్రీకాంత్ , డిసి అర్బి ఎస్సై రజిత మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టు పెన్షన్ దారులు సకాలంలో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలి

**జిల్లా పౌర సంబంధాల అధికారి పి. సీతారాం**

**వనపర్తి ప్రతినిధి నవంబరు 23 ప్రభాతవార్త:** జర్నలిస్టుల కుటుంబాల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంక్షేమ నిధి నుండి పెన్షన్ పొందుతున్న పెన్షన్ దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సిందిగా జిల్లా పౌర సంబంధాల అధికారి పి. సీతారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం ఇవ్వాల్సిన లైఫ్ సర్టిఫికెట్ నవంబర్ 30 లోపు పెన్షన్ దారులు స్వయంగా జిల్లా పౌర సంబంధాల అధికారి ముందుకు వస్తే అక్కడే లైఫ్ సర్టిఫికెట్ జారి చేయడం జరుగుతుందనీ, సకాలంలో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వని వారి పెన్షన్ నిలుపుదల చేసే అవకాశం ఉన్నందున జిల్లాలోని జర్నలిస్టు పెన్షన్ దారులు సకాలంలో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలని తెలిపారు.



## మహిళా సంఘాలకు మహర్దశ

**ఇందిరా మహిళా శక్తి భవననిర్మాణానికి ప్రభుత్వ ఆమోదం**

**వనపర్తి ప్రతినిధి నవంబరు 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతం పై ప్రత్యేక దృష్టి సారించిందని ,ఈ క్రమంలో వనపర్తి నియోజకవర్గంలో 5 కోట్ల రూపాయలతో ఇందిరా మహిళా శక్తి భవనం ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖఇందిరా మహిళా శక్తి భవనంగగ నియోజకవర్గంలోని మహిళా సంఘాల అభివృద్ధి కోసం, మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన కోసం ఈ భవన నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## రైతు సంఘం అధ్యక్షుడిగా జిఎస్ గోపి

**అమరచింత నవంబరు 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర చెరుకు రైతు సంఘం మహాసభలు ఖమ్మం జిల్లా మల్లేపల్లిలో నిర్వ హించారు. ఈ మహాసభలలో అమరచింత మున్సిపల్ వైస్ చైర్మన్ జిఎస్ గోపిని తెలంగాణ చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపికైన జిఎస్ గోపికి సిపిఎం జిల్లా నాయకులు బి వెంకటేష్ ఆర్ ఎన్ రమేష్ సిపిఎం మండల నాయకులు అజయ్ బుచ్చన్న హర్షం వ్యక్తం చేశారు.



## కార్యకర్తను పరామర్శించిన మాజీ మంత్రి

**ఖిల్లా గణపురం. నవంబరు 23ప్రభాతవార్త:** మండల పరిధిలోని సోలిపూర్ గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనారోగ్యంతో మహబూబ్నగర్లోని నవోదయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు తెలిపారు.



## రేణుకకు అంగన్వాడి టీచర్‌గా నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే



**మక్తల్ టౌన్ నవంబరు 23 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో గల 12వ వార్డులోని శ్రీమతి కర్రెం రేణుక గత కొన్ని సంవత్సరాలుగా అంగన్వాడి కేంద్రంతో ఆయా పని చేస్తున్న విధులు నిర్వహిస్తున్నారు. తనకు పదోన్నతి ద్వారా అంగన్వాడీ టీచర్‌గా ఉద్యోగం రావడంతో నియామక పత్రం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగానే డీపీవో ఎం. సరోజిని, శ్రీధర్ ,గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి గాయత్రి అనిల్, జట్ల అంజప్ప పృథ్వీరాజ్ , డ్రైవర్ రాములు, కర్రెంకృష్ణ, పొర్లనరసింహ, మునిసిపల్ క్రిష్ణ, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎస్ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధం చేయండి : ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్

**మహబూబ్‌నగర్‌బ్యూరో, నవంబరు23 ప్రభాతవార్త:** ఎస్సీ ఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న పాఠశాలల విద్యార్థుల యొక్క సామర్థ్యాలపై చేయబడుతున్న సర్వేలో విద్యార్థులు మంచి ప్రతిభను కనపరచాలని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ ఉపాధ్యాయులను కోరారు. మూడవ, ఆరవ, తొమ్మిదవ విద్యార్థులను ఈ పరీక్షకు సంసిద్ధులను చేయాలని మహబూబ్బగర్ జిల్లా కేంద్రంలోని మోడరన్ హైస్కూల్‌లో నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయుల సమావేశంలో ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సర్వే ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి దేశవ్యాప్తంగా అన్ని మేనేజ్మెంట్‌లోని విద్యార్థులకు నిర్వహించి తద్వారా వచ్చిన ఫలితాల ఆధారంగా దేశవ్యాప్తంగా విద్యారంగంలో చేపట్టవలసిన మార్పులు చేర్పులు నూతన సంస్కరణలు అన్నీ కూడా జరుగుతాయన్నారు. కావున సర్వేను ప్రతిష్టాత్మకంగా అన్ని రాష్ట్రాలు వారి ఎస్సీఆర్టీలా ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. కావున ఉపాధ్యాయులంతా ఈ సర్వేకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న ఏఎంవో శ్రీనివాస్

## ఎన్ సి సి సెలక్షన్లు వెంటనే చేయాలి

**వనపర్తి క్రైమ్, నవంబరు 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఎన్ సి సి సెల క్షన్లు వెంటనే జరపాలని శనివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వనప ర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏవో భాను ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో ఏవో సానుకూలంగా స్పందించి ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పరని వారు తెలిపారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా కేంద్రంలో ఎన్‌సిసి సెలక్షన్లు జర పకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఎన్‌సి సిలో చేరడం కోసం కళాశాలలో విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా మారిందన్నారు. ఎన్ సి సి కావాలి అంటే టీసీ తీసుకొని వేరే కళాశాలల్లో చేరాలని చెప్పడం సిగ్గుచేటని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, జిల్లా ఖేల్ కన్వీనర్ ఓంమేష్, నగర కార్యదర్శి జ్ఞానేశ్వర్, గిరిధర్ నాయుడు, విద్యార్థులుపాల్గొన్నారు.


ఏవో కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

## సామాజిక సర్వేను కంప్యూటరీకరణ

**చిన్న చింతకుంట, నవంబర్ 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక ,రాజకీయ కుల గణన సర్వే ఈనెల 6 నుంచి ఇంటింటి సర్వేను నిర్వహించిన సామాజిక సర్వే పత్రాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలో ఉం ద్యాలలో 9, మండల వనరుల భవనంలో ఆరు, మండల పరిషత్ లో ఆరు కంప్యూటర్లు ఏర్పాటు చేసి సామాజిక సర్వేను ఆన్ లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలను అనుగుణంగా కంప్యూటర్లో పొందుపరుస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కంప్యూటరీకరణ తప్పులు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని ఆన్లైన్లో నమోదు చేస్తున్న అధికారులకు సూచించారు. ఇప్పటివరకు 99.4 సామాజిక సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.


సర్వే వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్న దృశ్యం

## న్యాయవాదిగా మారిన దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, నవంబరు 23 ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి న్యాయవాదిగా మారారు. ఎమ్మెల్యేగా అనుచరులతో సభలు, సమావేశాలకు హడావిడిగా తిరిగే ఎమ్మెల్యే హఠాత్తుగా న్యాయవాదిగా మారారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో ఒక కేసు విషయంలో నల్లకోటు ధరించి వాదించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి రాజకీయాలకు రాక ముందు న్యాయవాదిగా కొనసాగేవారు. అయితే రాజకీయాలకు వచ్చిన తర్వాత మహబూబ్నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతూనే గత అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకద్ర ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అయితే చాలా కాలం తర్వాత ఓ కేసు విషయమై రంగారెడ్డి జిల్లా కోర్టులో నల్ల కోర్టు వేసుకొని ఓ కేసు విషయంలో వాదించారు. ఈ సందర్భంగా తన సహచరులు, జూనియర్లతో ఎమ్మెల్యే కాసేపు గడిపారు.


న్యాయవాదులతో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

## అంబులెన్స్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు వినతి

**మూసాపేట్, నవంబరు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని మండలంలోని ఆయా గ్రామాల యువకులు గ్రామస్తులు తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సంకల్ మద్ది యువకులు రాము మాట్లాడుతూ జాతీయ రహదారికి రెండు వైపులా మండల పరిధి కొన్ని కిలోమీటర్ల మేరా ఉన్నందున రోడ్డు క్రాసింగ్ దగ్గర చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి మండలంలో చుట్టుపక్కల గ్రామాలలో అత్యవసర సమయంలో అంబులెన్స్ లేక ప్రైవేట్ ఆటోలో వెళ్ళవలసి వస్తుంది ప్రమాదాలు జరిగి గాయపడ్డ వారిని జిల్లా ఆస్పత్రికి తరలించాలని 108 ఫోన్ చేస్తే పక్క మండలం అడ్డాకుల లేదా దేవరకద్ర నుండి రావాలి అని అంబులెన్స్ డ్రైవర్లు చెప్తున్నారు చాలా సమయం పడుతుంది గాయపడ్డ వారిని సరైన సమయంలో ఆస్పత్రికి చేరలేకపోతున్నారు మండల కేంద్రంలోని అంబులెన్స్ ఏర్పాటు చేస్తే ఇలాంటి ఇబ్బందులు కలగకుండా ఉంటుందని కోరారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బిఎస్పి జనరల్ సెక్రెటరీ వేముల కొండన్న, రాము, తుంకిలి పురం కృష్ణ, గోవర్ధన్, కుర్వ ఆంజనేయులు, డాక్టర్ బీరప్ప, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## భక్తులతో కురుమూర్తి కొండ కిటకిట

**చిన్న చింతకుంట, నవంబర్ 23 ప్రభాతవార్త:** శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన స్వామి వారి జాతర కొనసాగుతున్నదంతో కార్తిక శనివారం కావదంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఆటోలు ,ద్విచక్ర వాహనాలపై వేలాదిగా తరలి రావడంతో శ్రీ కురుమూర్తి స్వామి కొండ భక్తులతో కిటకిటలాడింది .కొండ దిగువ నుంచి స్వామి వారి సన్నిధి వరకు క్యూ లైన్లలో భక్తులు బారులు తీరి స్వామి వారి దర్శించుకునేందుకు గంటల కొద్దీ వేచియున్నారు. కాంచన గుహలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామిని కన్నులారా వీక్షించి భక్తులు పునీతులయ్యారు .కొండ దిగువన స్వామివారికి దాసంగాలతో నైవేద్యం సమర్పించి కురుమయ్య సల్లంగా చూడవయ్యా అంటూ భక్తులు వేడుకున్నారు. జాతర మైదానంలో యాత్రికులతో దుకాణ సముదాయాలు రద్దీగా మారాయి.




స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

# 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ డయాబెటిస్ స్క్రీనింగ్ చేయాలి

### వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి ప్రతినిధి నవంబరు 23 ప్రభాతవార్త :** మిషన్ మధుమేహ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 5 పిహెచ్‌సీల పరిధిలో 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ డయాబెటిస్ స్క్రీనింగ్ వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ తో కలిసి మెడికల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ మధుమేహ లో భాగంగా ఎంపిక చేసిన 5 పీహెచ్సీల పరిధిలో 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ డయాబెటిస్ స్క్రీనింగ్ చేపట్టాలని, స్క్రీనింగ్ చేసేటప్పుడే వివరాలను ఆన్లైన్లో అప్డేట్ చేసి అభా ( ఆయుష్మాన్ భారత్) ఐడి జనరేట్ చేయాలన్నారు. ఆశాలు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, మెడికల్ ఆఫీసర్లు అందరూ సమన్వయం చేసుకుంటూ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. ఇప్పటివరకు ఎంతమందికి స్క్రీనింగ్ పూర్తి చేశారు అని అదనపు కలెక్టర్ ప్రశ్నించగా, 29 వేల మందికి పూర్తయిందని అధికారులు సమాధానం ఇచ్చారు. డిసెంబర్ 31 లోపు అందరికీ పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో వైద్యాధికారులు, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ , హాజరైన సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, మెడికల్ ఆఫీసర్లు

# గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

### ర్యాగింగ్ చేయడం చట్టరీత్య నేరం సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట టౌన్, నవంబరు 23 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా, కోస్గి మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ క్రైమ్ మరియు ర్యాగింగ్ లపై విద్యార్థిని విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కు ముఖ్య అతిధిగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ,ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల హాజరై దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఈ విధంగా సాధించాలని ఈ సందర్భంగా అధికారులు తమ జీవితంలో సక్సెస్ అవ్వడానికి స్కూలు కళాశాల నుండి, పోటీ పరీక్షలకు ఏ విధంగా చదివారు, చదివిన విధానం ఉన్నత లక్ష్యానికి చేరడానికి పడ్డ కష్టాన్ని, కష్టపడే తత్వాన్ని, జీవితంలో సక్సెస్ అయిన విధానాన్ని వారి యొక్క జీవిత పాఠాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉత్తమ ఇంజనీర్లుగా ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకరావలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలాంటి వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మాదకద్రవ్యాలు సమూలంగా నిర్మూలించుటలో యువత పోలీసులకు సహకరించాలని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడడం వలన క్రమేపి ఆరోగ్యం క్షీణించడంతో పాటు అది ఒక వ్యసనంగా మారుతుందని, నేర ప్రవృత్తి వైపు దారి తీస్తుందన్న విషయం గమనించాలని పేర్కొన్నారు. కావున దానిని ఆది నుంచి తొలగించాలని కోరారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు మీ పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సైబర్ క్రైమ్: నేటి సమాజంలో సాంకేతికత పెరుగుదలతో పాటు సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయని వాటి పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, వీటిపై ప్రతి ఒక్క విద్యార్థికి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనవసరమైన లింకులు ఓపెన్ చేయరాదని, ఓటిపిలు ఇతరులకు తెలపరాదని, సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఒకవేళ నేరానికి గురి అయితే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. ర్యాగింగ్: విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటి దశలోనే కట్టడి చేయాలని, కళశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపినారు. విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్షణం కాదు అని తెలిపినారు. విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనేది లేకుండా స్నేహపూర్వకంగా కలిసి మెలిసి విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ర్యాగింగ్ కు పాల్పడే వారి వివరాలను కళాశాల యజమాన్యానికి లేదా సంబంధిత పోలీసులకు లేదా డయల్ 100 కు తెలియజేసి సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా మహిళలు, అమ్మాయిల పై నేరాలు జరగకుండా ఉండాలంటే విద్యార్థినిలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని, నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నాప్పుడే మరింత భద్రత కల్పించగలువుతామని, మహిళలు, విద్యార్థినిలు జిల్లా షీ టీమ్ కు పిర్యాదు చేసినచో చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. ఈ సమావేశంలో సిఐ దస్రు నాయక్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, యంఈఓ శంకర్ నాయక్, ఎంపీడీవో శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్సై బాల్ రాజ్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి : తహసీల్దార్

**ఉప్పునుంతల, నవంబరు 23ప్రభాతవార్త :** 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును నమోదుచేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల సూచించారు. శనివారం మండలంలో నిర్వహిస్తున్న బూత్‌లెవెల్ ఆఫీసర్ల ఓటర్ నమోదుకార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రమీల, ఉప తహసీల్దార్ కేశవ్‌లు పరిశీలించారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావాలని తహసీల్దార్ పేర్కొన్నారు. అదే విధంగా నేడు ఆదివారం 24.11.2024ను మండల పరిధిలోని అన్నిగ్రామాల పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటర్ నమోదు సవరణ కార్యక్రమం నిర్వహించాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవెల్ అధికారులు (బిఎల్‌ఓ)లు ఫారం నెంబర్ 6,7,8 దరఖాస్తు తో అందుబాటులో ఉంటారని, 1.1.2025 రోజు వరకు 18 సంవత్సరాలు పూర్తి అయినటువంటి యువతి, యువకులు కొత్తగా ఓటరు నమోదు ఫారం నెంబర్6, ఇప్పటి కే ఓటరు కార్డు ఉన్న వారికి ఏమైనా సవరణలు ఉన్నచో ఫారం 8, అలాగే ఓటరు లిస్టు నుంచి పేరు తొలగించుటకు ఫారం 7 దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. కావున అర్హులైన యువతి, యువకులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రమీల, ఉప తహసీల్దార్ కేశవ్, జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న బిఎల్ ఓ లు ఓటర్ నమోదు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.


ఓటరు నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రమీల

## 11 నెలల్లో 12 పథకాలు అమలు చేసి చూపించాం

### డిసెంబర్ 7న ప్రతి ఒక్కగ్రామ, మండల స్థాయిలో సంబరాలు :వనపర్తి డి సి సి జిల్లా అధ్యక్షుడు ఎం రాజేంద్రప్రసాద్

**పెబ్బేర్ నవంబరు 23 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలో శనివారం రోజు డిసిసి జిల్లా అధ్యక్షులు ఎం రాజేంద్రప్రసాద్ పత్రికామిత్రుల సమావేశంలో మాట్లాడుతూ అతి కష్ట కాలంలో కూడా ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు లో మాట తప్పకుండా 12 హామీలు చేసి చూపించామని వారు తెలియజేశారు రైతు రుణమాఫీ, హాస్టల్ మిస్ చార్జీల పెంపు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఆరోగ్య శ్రీ కింద పది లక్షల వరకు పెంపు, మహిళలకు ఉచిత బస్సు, 500 కే వంట గ్యాస్, ఉచిత విద్యుత్తు 200 యూనిట్ల వరకు, రైతులకు సన్నరాల కాలకు 500 బోనస్సు, గృహ డామేజ్ పరిహారం, పంట నష్టపరిహారం , సీనియర్ సిటిజన్ లకు 75 రాయితీ, సామాజిక విద్యా ఉపాధి రాజకీయ కుల సర్వేతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని. సర్వే తో ప్రజలకు ఎలాంటి నష్టం జరగదని సర్వే వల్ల మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని డిసెంబర్ 7న ప్రతి ఒక్క గ్రామ మండల స్థాయిలో సంబరాలు ఘనంగా జరపాలని డిసిసి జిల్లా అధ్యక్షులు ఎం రాజేంద్రప్రసాద్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కార్పాకుల వెంకట్ రాములు యాదవ్ నాయకులు మన్నెం, కృపాకర్ రెడ్డి, రాంపురం సహదేవుడు, రాజశేఖర్ గౌడ్ విజయవర్ధన్ గౌడ్, పాతపల్లి చంద్రశేఖర్, శివ, రణధీర్ రెడ్డి అంజి అనిల్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

## వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి

**వనపర్తి నవంబరు23 ప్రభాతవార్త:** తెలంగాణరాష్ట్రంలో గత శాసనసభ ఎన్నికల తెలంగాణ రాష్ట్రంలో గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చినహామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి బిజెపి తరఫున మద్దతు తెలపారు. శనివారం వికలాంగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు మొదలుపెట్టిన రిలే నిరాహారదీక్షలకు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర నాయకులు సర్పంచులసంఘం మాజీరాష్ట్రఅధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తంరెడ్డి భారతీయ జనతా పార్టీ తరఫున మద్దతుగా నిలిచారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి దివ్యాంగులకు 4 వేల, నుండి 6 వేలకు, కండరాల క్షీణత కలిగిన దివ్యాంగులకు 4, వేల నుండి 15, వేలకు పెంచాలని, చేయూత పెన్షన్ 2016 నుండి 4 వేల 16 రూపాయల కు, పెంచాలని, దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, దివ్యాంగులకు 2016 దివ్యాంగ చట్టం అమలు పరచాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ మొదలు పెడతామని బిజెపి రాష్ట్ర నాయకులు సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రామన్న వెంకటేశ్వర్ రెడ్డి ,వనపర్తి మండల అధ్యక్షులు సంద వెంకటేష్, వనపర్తి పట్టణ అధ్యక్షులు బచ్చు రాము, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వెంకటస్వామి ,పట్టణ ప్రధాన కార్యదర్శి మామిళ్ళపల్లి రాయన్న సాగర్ తదితరులు పాల్గొన్నారు.


నిరాహారదీక్షకు మద్దతు తెలుపుతున్న బిజెపి నాయకులు

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

**మక్తల్, నవంబర్ 23 ప్రభాతవార్త:** ఇటీవల వరంగల్ జిల్లాలో జరిగిన అండర్ 17 స్కూల్ గేమ్స్ లో మక్తల్ పట్టణంలోని ఈనాడు లక్ష్యం అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు పాల్గొని మూడు బంగారు పతకాలు, ఒక వెండి పతకం, ఒక రజత పతకం సాధించి ఈనెల 26 నుండి ఉత్తరప్రదేశ్ లక్నో లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జాతీయ స్థాయికి ఎన్నికైన క్రీడాకారులు బసంత్, విశాలాక్షి, అలేఖ్యలను స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, ప్రిన్సిపాల్ రేవతి, పిఈటి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

## పిఆర్ టి యు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**ఉప్పునుంతల, నవంబరు 23 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్‌జిల్లా నూతన గౌరవ అధ్యక్షునిగా ఎస్. బిచ్యానాయక్ ఎన్నిక కావడంతో శని వారం అయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గౌరవ అధ్యక్షులుగా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈసన్మాన కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మేడ్‌పూర్ మల్లికార్జున్, రాష్ట్ర ఉపాధ్య క్షులు శ్యాంసుందర్‌గౌడ్, జిల్లా బాధ్యులు అజ్మతుల్లా, సీనియర్ సభ్యులు రాములు నాయక్, ఉప్పునుంతల మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి అమీర్, మండల బాధ్యులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

**దేవరకద్ర, నవంబరు 23 ప్రభాతవార్త:** వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం రైతులు 496 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ ధాన్యాన్ని విక్రయానికి తీసుకువచ్చారు. ఈ ధాన్యానికి క్వింటాల్ కు అత్యధికంగా రూ. 2666ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ. 2,159 ధర పలికింది. అలాగే 12 క్వింటాళ్ల హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి అత్యధికం గాక్వింటాలుకు రూ. 19.11ధర పలికింది. అలాగే అతి తక్కువగా కూడా అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## స్మార్ట్ టీవీని అందించిన పూర్వ విద్యార్థి

**మాగనూరు, నవంబరు 23 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎంపిపిఎస్ వడ్వాట్ పాఠశాల పూర్వ విద్యార్థి అయినటువంటి జి మహేందర్ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నటువంటి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ కనీస సామర్థ్యాలు భాష పై పట్టు సాధించడానికి ముఖ్యంగా సి గ్రేడ్, వెనుకబడిన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని స్మార్ట్ టివి ఎల్‌జి రూ. 14000 వేల గల టీవీని ఎంపిపిఎస్ పాఠశాలకు బహుకరించడం జరిగినది. అందుకుగాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. గోవర్ధన్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మరియు ఉపాధ్యాయ బృందం గ్రామ పెద్దలు అందరూ అభినందించడం జరిగినది.

## ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం

**మాగనూరు, నవంబరు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ యొక్క ఓటర్ నమోదు కార్యక్రమంలో 01 జనవరి2025 నాటికి 18 సంవత్సరాలు నిండి ఉండాలని బిఎల్‌ఓల దగ్గర ఓటర్ నమోదు చేసుకోగలరని ఓటర్ జాబితా లోని ఏమైనా మార్పులు చేర్పులు ఉన్నట్లయితే స్పెషల్ క్యాంపెయిన్ రోజున సరి చేసుకోవచ్చని మాగనూరు గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 64 65 66 67 పీఎస్ లను తాసిల్దార్ శ్రీ సురేష్ నిర్వహిస్తున్నట్లుగా విలేకరుల సమావేశంలో తెలియజేయడం జరిగింది.

## అన్నదాన సత్రా నిర్మాణానికి విరాళం వితరణ

**మూసాపేట్, నవంబరు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మూసాపేట లో గల సంకల్ప సిద్ధి అయ్యప్ప క్షేత్రంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రానికి మూసాపేట గ్రామానికి చెందిన మధుక అలివేల రాజేందర్ దంపతులు కుమారుడు కిరణ్ కుమార్, శనివారము 51,000 విరాళంగా అందజేశారు అనంతరం అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు విరాళా దాతను సత్కరించి అయ్యప్ప కరుణా కృప ఎల్లప్పుడూ ఉండాలని కోరారు కార్యక్రమంలో గురు స్వాములు నల్ల తిరుపతయ్య గౌడ్ ,కొంగరి శ్రీనివాసులు ,మేకల ప్రభాకర్, పటేల్ నరసింహ రెడ్డి ,అయ్యప్ప స్వాములు సతీష్ సాగర్, ఆలయ పూజారి భాను తదితరులు పాల్గొన్నారు.

